క్లుప్తంగా

కరెన్సీ నోట్లతో అయ్యప్పకు అలంకరణ



నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మూల విరాట్టు పంచలోహస్వామి విగ్రహానికి శనివారం 25వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు దేవిష్మిత్రా ఆధ్వర్యంలో అయ్యప్పను కరెన్సీ నోట్లతో అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా, ఆలయ అధ్యక్షుడు సైఫా సురేశ్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, మాదారపు చంద్రశేఖర్, భూపతి లక్ష్మీనారాయణ, ఇరుకుల్ల వీరలింగం, దోమకుంట్ల సదానందంస్వామి, పాలకుర్తి శ్రీనివాస్, వజినేపల్లి శ్రీనివాస్, వేంశెట్టి శ్రీనివాస్, డాక్టర్ మోహన్‌రావు, వినోద, శింగిరికొండ అండాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

108 రకాలతో నైవేద్యం



దుగ్గొండి : మండలంలోని కేశవాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం అలంకార సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు 108 రకాలతో తయారు చేసిన ప్రదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అర్చకులు ప్రదీప్, సాగర్, దేశికన్, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



మాట్లాడుతున్న డాక్టర్ గణేశ్

సంగెం : మండలంలోని గవిచర్లలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డాక్టర్ గణేశ్ శనివారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల దృష్టి లోపాన్ని నివారించే దిశగా గత ఫిబ్రవరిలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తోందని తెలిపారు. విద్యార్థులు కళ్లను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. దృష్టి లోపం సమస్యలుంటే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేసి వైద్య సేవలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రజిత, ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మి, ఏఎన్ఎం సమీనా తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆలయ ధర్మకర్త మృతి

నల్లబెల్లి : మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త, గ్రామాభివృద్ధి కమిటీ ముఖ్య సలహాదారు కొండ లక్ష్మణస్వామి (75) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలయ, గ్రామ అభివృద్ధికి లక్ష్మణ స్వామి ఎనలేని సేవలు అందించారని చెప్పారు. లక్ష్మణ స్వామి మృతి తీరని లోటన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నానబోయిన రాజారాం, నాయకులు సట్ల శ్రీనివాస్, నాగెల్లి శ్రీనివాస్, గొనేల నరహరి, వైనాల వీరస్వామి, గుమ్మడి వేణు, వేల్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి



వర్ధన్నపేట/రాయపర్తి : కాన్షీరాం చిత్రపటానికి మాదిగల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జన్ను రాములు, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మరిపట్ల అంజయ్య శనివారం ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేటలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో, రాయపర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కాన్షీరాం జయంతి కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. కాన్షీరాం సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల మహేశ్, ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు ఈరెల్లి శ్రీనివాస్, ప్రజా పార్టీ రాష్ట్ర నాయకుడు మల్లెపాక చంద్రమౌళి, ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) మండల అధ్యక్షుడు గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల నిరీక్షణ ఫలించేదెన్నడో...?

● రెండేళ్లుగా బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం

సంగెం : అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని ఉందన్న చందంగా తయారైంది మండలంలోని బీకోజీనాయక్ తండ, బాలునాయక్ తండాల రైతుల పరిస్థితి. బ్రిడ్జి నిర్మిస్తే పూర్తైతే రెండు తండాలతోపాటుగా చుట్టుపక్కల గ్రామాలకు దూరం తగ్గి సమయం ఆదా అవుతుందన్న అనేక దశాబ్దాల నిరీక్షణ ఎన్నడు ఫలిస్తుందోనని రైతులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ రెండు తండాల మధ్య ఎల్గూర్ చెరువు మత్తడి నీరు, చెరువు వెనకాల పొలాల పడుబాటు నీరు వెళ్లే వాగుపై బ్రిడ్జి నిర్మాణంతోపాటుగా బీటీ రోడ్డు నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఐటీడీఏ నుంచి రూ.2.68 కోట్లు మంజూరయ్యాయి. 2022 డిసెంబర్ 20న నాటి గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇటీవల సుమారు 4, 5 నెలల క్రితం పనులను ప్రారంభించారు. గతంలో ఉన్న మట్టి రోడ్డుకు ఇరువైపులా పొలాల్లోని మట్టి తీసి పోశారు. వాగులో నీటి మళ్లింపు కోసం కాల్వ తీసి అంతటితో వదిలేశారు. నాటి నుంచి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం, యాసంగి సమయంలో వాగుకు ఇరువైపులా ఉన్న పొలాలకు రాకపోకలు సాగించేందుకు, ఎరువులు తీసుకెళ్లేందుకు, పండిన పంట రవాణాకు రైతులు పడే అవస్థలు వర్ణనాతీతం. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే (ఫైల్)



ఇరువైపులా మట్టి పోసి వదిలివేసిన రోడ్డు

నిర్మాణంలో జాప్యంతో ఇబ్బందులు

పంట పొలాలు వాగుకు ఇరువైపులా ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి నారు పోసినప్పటి నుంచి పంట కోసి ఇంటికి తీసుకొచ్చే వరకు వాగు మీదుగా రాకపోకలు సాగించడం చాలా ఇబ్బందిగా ఉంది. నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల పనులను ప్రారంభి పూర్తి చేయకుండానే వదిలేసింది. నిర్మాణ పనులు సాగడం లేదు.

– గుగులోత్ రవి, రైతు, బీకోజీనాయక్ తండ

ఎడ్ల బండ్లూ వెళ్లలేని దుస్థితి

గతంలో రబీ సీజన్లలో వాగులోంచి ఎడ్లబండ్లు రాకపోకలు సాగించేవి. బ్రిడ్జి నిర్మాణం కోసం వాగులో నీటిని మళ్లించేలా పాయ చేయడంతో బండ్లు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. నిత్యం పొలాల వద్దకు వెళ్లిరావడానికి రైతులు, కూలీలకు తిప్పలు తప్పడం లేదు. బ్రిడ్జి, రోడ్డు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– గుగులోత్ రమేశ్, రైతు, బీకోజీనాయక్ తండ

త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తాం

బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనుల్లో రెండేళ్ల జాప్యం జరిగిన విషయం వాస్తవమే. అనివార్య కారణాలతో పనులు చేపట్టడంలో ఆలస్యం జరిగింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అధికారుల సహకారంతో త్వరలోనే పనులు ప్రారంభించి వచ్చే వానాకాలంలోగా బ్రిడ్జి, రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయిస్తాం. ఆ దిశగా చొరవ తీసుకుంటాం.

– బి.శ్రీనివాస్, ఏఈ, ఐటీడీఏ

డీసీఈబీ నిధుల గోల్‌మాల్!

● విద్యార్థుల ఫీజులు దుర్వినియోగం
● సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశాలు

కాళోజీ సెంటర్ : విద్యార్థులకు వినియోగించాల్సిన నిధులను విద్యాశాఖ అధికారులు దారి మళ్లించిన బాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. డిస్ట్రిక్ట్ కామన్ ఎంట్రెన్స్ బోర్డు (డీసీఈబీ) నిబంధనలు తుంగలో తొక్కి విద్యాశాఖ అధికారులు ఇష్టారీతిన ఖర్చుపెట్టిన విషయం డీఈఓ కార్యాలయంలో హాట్‌టాపిక్‌గా మారింది. ప్రైవేట్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో నిర్వహించే పరీక్షల నిర్వహణకు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కొంత నిధిని విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో సమకూరుస్తుంది. ఉమ్మడి పరీక్షల ప్రశ్నపత్రాల తయారీ, సైన్స్ ఎగ్జిబిషన్స్, టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతులకు, కౌన్సెలింగ్‌కు మాత్రమే వినియోగించాల్సి ఉండగా అధికారులు కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా నిధులను దారి మళ్లించి ఖర్చు పెట్టినట్లు డీఈఓ కార్యాలయంలో చర్చ జరుగుతోంది. ఈ విషయంపై డీసీఈబీ కార్యదర్శిని వివరణ అడిగే ప్రయత్నం చేయగా స్పందించలేదు. డీసీఈబీ కార్యాలయానికి తాళం వేసుకొని రెండు రోజుల నుంచి రావడం లేదని తెలుస్తోంది.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఆరా

డీసీఈబీలో నిధులు గోల్‌మాల్ జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీఈఓను ఆదేశించినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఈబీ కార్యదర్శి గురించి కలెక్టర్ దృష్టికి రాకపోవడంతో డీఈఓపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీసీఈబీలో నిధులు గోల్‌మాల్ జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఎవరు పట్టించుకోకపోవడంతో నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిధుల దుర్వినియోగంపై విచారణ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ నివేదిక అడిగింది నిజమే..



డీసీఈబీ నిధుల ఖర్చు విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు వచ్చింది. దీనిపై నివేదిక ఇవ్వాలని అడిగారు. నిధులను ఇతర అవసరాలకు ఖర్చు చేశాం. కానీ అందుకు సంబంధించిన డబ్బులు జమచేయాల్సిందే. త్వరలోనే నిధుల విషయంపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం.

– జ్ఞానేశ్వర్, డీఈఓ

దుగ్గొండి : మేకపోతుల ప్రభబండ్లతో బయల్దేరిన ప్రజలు



జాతరలకు ప్రభబండ్ల జోరు



నర్సంపేట : ప్రభబండిపై బీజేపీ నేత రాణిరుద్రమ



నర్సంపేట : పల్సర్‌పై వెళ్తున్న ప్రభబండి

నర్సంపేట/నర్సంపేట రూరల్/దుగ్గొండి : చెన్నారావుపేట మండలంలోని కోనాపురం, దుగ్గొండి మండలంలోని కొమ్మాల జాతరలకు ప్రభబండ్ల జోరు సాగింది. కోనాపురంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతరకు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కొమ్మాల జాతరకు నర్సంపేట నుంచి బీజేపీ ఆధ్వర్యంలో బయల్దేరిన 10 ప్రభ బండ్లను ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే నర్సంపేట మండలంలోని రాములునాయక్‌తండా నుంచి కాంగ్రెస్ నాయకులు ప్రభబండి ఏర్పాటు చేయగా దుగ్గొండి మండలంలోని నాచినపల్లిలో 8 చక్రపు (దేవుని) బండ్లతోపాటు గొర్రె కాపరులు మేకపోతేళ్ల బండ్లు తీసుకెళ్లారు. సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండ్ల ప్రభబండిని మహిళా కళాకారుల నృత్యాలతో వేడుకగా తీసుకెళ్లారు. కోనాపురం జాతరకు నర్సంపేట మండలంలోని కాల్‌నాయక్‌తండాకు చెందిన లావణ్య సుమన్ పల్సర్ బైక్‌పై, కందికొండ దేవేందర్ మినీ ట్రాక్టర్‌పై, పరికి లచ్చయ్య మేకపోతులతో ప్రభబండ్లు కట్టారు. ఈ సందర్భంగా కోనాపురంలో ఆలయ నిర్మాణానికి స్థానిక ఉపాధ్యాయురాలు శ్రీదేవి రామ సుధాకర్ రూ.30,116 విరాళం అందజేశారు.

ఏఐతో అభ్యసనా సామర్థ్యాల పెంపు

● ఎంఈఓలు సారయ్య, శ్రీధర్



రాయపర్తి:డిజిటల్ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎంఈఓ

నర్సంపేట రూరల్/రాయపర్తి : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందుతాయని నర్సంపేట, రాయపర్తి ఎంఈఓలు కొర్ర సారయ్య, మామునూరి శ్రీధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరం ప్రభుత్వ హైస్కూల్‌లో, రాయపర్తి మండలంలోని ఊకల్ హైస్కూల్‌లో ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లను ఎంఈఓలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు మాధురి, స్వరూప, సరిత బాయి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను హైస్కూల్ హెచ్‌ఎం రవీందర్ ప్రారంభించగా స్టేట్ రిసోర్స్‌పర్సన్ రాయపురెడ్డి మాట్లాడారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులు ఏఐతో ప్రగతి సాధిస్తారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం కరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయం

● ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆచార్య



సర్వే సామగ్రిని అందజేస్తున్న అధికారులు

గీసుకొండ : జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా రేపటి (సోమవారం) నుంచి ఈనెల 30 వరకు ఇంటింటి సర్వే చేయనున్నట్లు ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆచార్య తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధి నిర్ధారణ, వైద్యసేవల కోసం సమర్థవంతంగా సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది 30 వరకు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సర్వే నిర్వహించాలని చెప్పారు. శరీరంపై మచ్చలున్న వారికి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యాధిగ్రస్తులు నిర్లక్ష్యం చేయకుండా అవగాహన కల్పించడంతోపాటు చికిత్స తీసుకునే విధానంపై చైతన్యవంతం చేయాలని తెలిపారు. సమన్వయంతో పని చేసి సర్వేను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సిబ్బందికి సర్వే సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ నర్సింహారెడ్డి, డీపీఎంఓలు అనుపమ, వెంకన్న, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సేవలే లక్ష్యం



నర్సంపేట : బాధిత బాలికలు, మహిళలకు సేవలు అందించడమే సఖి కేంద్రాల లక్ష్యమని కేస్ వర్కర్లు స్వప్న, తిరుమల తెలిపారు. పట్టణంలోని సర్వాపురంలో మహిళలకు శనివారం ఏర్పాటు అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు, బాలికలు ఇంటా, బయట సమస్యలు ఎదుర్కొంటున్న పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అత్తింటి వేధింపులు, ఇతర సమస్యలతో పలువురు మహిళలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పలువురు బాలికలు అనేక సమస్యలతో సతమతమవుతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందుల్లో ఉన్న బాలికలు, మహిళలకు న్యాయ, వైద్య, వసతి, తదితర సేవలు కల్పించేలా సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. సఖి కేంద్రాలను సంప్రదిస్తే బాధితులకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు పోలీసు, న్యాయ సహాయం అందుతుందని వివరించారు. సఖి సెంటర్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు, బాలికలు 181 నంబర్‌కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న హింస, హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. కరపత్రాలను ప్రదర్శించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ, చౌటపల్లి, కొంపాక గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు జయహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ గాయపు లింగారెడ్డి శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అక్కినపెల్లి సతీశ్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తోడ్పాటు అందించే లక్ష్యంతో ఫౌండేషన్ ద్వారా ఏడేళ్లుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భూక్యా రాములు, మండల కార్యదర్శి నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నెక్కొండ : ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సదువాల అరుణ్ (27) ఓ హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అరుణ్ గతంలో ఓ యువతిని ప్రేమించాడు. ఆమె అతడి ప్రేమను తిరస్కరించగా మనస్తాపానికి గురై ఈనెల 3న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అరుణ్ మృతితో స్థానికంగా విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నైతిక విలువలు, నైపుణ్యాలు కీలకం

● జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య



ఖానాపురం : మాట్లాడుతున్న డీటీడీఓ సౌజన్య

ఖానాపురం : విద్యార్థులకు నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు కీలకమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (డీటీడీఓ) సౌజన్య స్పష్టం చేశారు. మండలంలోని అశోక్‌నగర్‌లోని కేజీబీవీ, బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు అవసరం మేరకే సెల్‌ఫోన్లు వినియోగించాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలను బట్టీ విధానంలో కాకుండా అధ్యయన రీతిలో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించడం ఖాయమన్నారు. ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మేనక, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పెరక సునీత, తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు పెంచుకోవాలి

పర్వతగిరి : విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంచుకోవాలని తహసీల్దార్ వెంకటస్వామి సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పాక రమేశ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమ పరిశీలకుడు, రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడు రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు.

విలువలతో కూడిన బోధన..

సంగెం : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధన అందించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్ఫూర్తి కార్యక్రమ కోఆర్డినేటర్లు రమేశ్, వెంకటయ్య తెలిపారు. మండలంలోని గవిచర్లలోని మోడల్ స్కూల్ నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మి, అధ్యాపకులు విజయ్‌కుమార్, రామారావు, భవ్యశ్రీ, పావని తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు

పర్వతగిరి : విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని ఎంపీడీఓ మాలోతు శంకర్ నాయక్ సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్ మాట్లాడారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు రాజప్రభు, కళ్యాణ్‌కుమార్, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈసీ కె.రాజు, ఎమ్మార్సి స్టాఫ్ గారే జయరాజ్, ఎంపీడీఓ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ మోసాలకు చెక్



బ్యాంకు ఉద్యోగులుగా వ్యవహరించిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు

రాయపర్తి : అవగాహన పెంచుకోవడం ద్వారానే సైబర్ మోసాలకు చెక్ పెట్టగలమని మండలంలోని కొండూరు ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం పద్మలత తేటతెల్లం చేశారు. 'ఆన్‌లైన్ మోసాలు, ఫైనాన్షియల్ లిటరసీ'పై ఆ స్కూల్‌లో శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు బ్యాంకింగ్ సేవలపై చైతన్యవంతం కావాలని సూచించారు. విద్యార్థులతో మోడల్ బ్యాంకింగ్ నిర్వహించగా విద్యార్థులు బ్యాంక్ ఉద్యోగులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సత్యం, రాంరెడ్డి, వీవీఆర్.ఆచార్య, కేసోజు సత్యనారాయణ, కటకం రఘు, వెంకటరమణ, శ్యాంసుందర్, నాగరాజు, స్వామి, భోజ్యానాయక్, శివకృష్ణ, రాజు, శ్రీదేవి, అనితారాణి, అమర స్వర్ణ, రమ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చరిత్రపై చైతన్యం కీలకం

● జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీకాంత్

వర్ధన్నపేట : సమసమాజ నిర్మాణం కోసం మహనీయుల చరిత్రపై ప్రజలను చైతన్యవంతం చేయడం కీలకమని జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో కాన్షీరాం జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ఉన్నతి కోసం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, కాన్షీరాం లాంటి అనేక మంది మహనీయుల శ్రమించారని చెప్పారు. వారి జీవిత చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రజాసంఘాల మీదే ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం ఉత్సవాల నిర్వహణకు కమిటీ వేశారు. కన్వీనర్‌గా శ్రీకాంత్, కోకన్వీనర్‌గా కంజర్ల మహేశ్, సభ్యులుగా వల్లందాస్ కుమార్, మరిపట్ల అంజయ్య, మామిండ్ల చెన్నయ్యయాదవ్, ఎర్రెల్లి శ్రీనివాస్, తాటికాయల వివేకానంద, మారపల్లి ఎల్లయ్య, చిన్న రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో మాదిగల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

పర్వతగిరి : అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణను అమలు చేయాలని, మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేస్తామని గొప్పలు చెప్పిన మాట నిలబెట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. వర్గీకరణలో మాదిగలకు అన్యాయం చేస్తూ రాజకీయంగా కూడా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, దానికి నిదర్శనమే ఇటీవల ప్రకటించి ఎమ్మెల్సీని బట్టి అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా ధరమ్మయ్య, పసుల హరికుమార్, బొట్ల కిష్టయ్య, మాజీ సర్పంచ్ చింతపట్ల వెంకటేశ్వరరావు, చిన్నపల్లి శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.